ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
3★★★
బుధవారం 5 నవంబరు 2025



‘తెల్ల’బోతున్నారు..



- సీసీఐ కొర్రీలతో పత్తి రైతుల్లో అయోమయం
- జిల్లాలో ఐదు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- ఇప్పటికే కపాస్ కిసాన్ యాప్‌తో ఇబ్బందులు
- సీసీఐ నిర్ణయంపై ఆందోళనకు రైతులు, ప్రతిపక్ష పార్టీలు సిద్ధం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

పత్తి రైతుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. అతివృష్టి, అనావృష్టిని తట్టుకొని పంటను కాపాడుకున్న పత్తి అమ్ముకోవడానికి ఇబ్బందులు తప్పడం లేదు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రతి ఏటా పత్తి రైతులకు దూది పూల దుఃఖాన్ని మిగిలిస్తుంది. జిల్లాలో పత్తి రైతులు అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు నష్టాన్ని చవిచూడగా, పంట చేతికొచ్చే దశలో మొంథా తుఫాన్ కూడా కలవరపెట్టి పోయింది. మిగిలిన పత్తి దిగుబడిపై ఆశలు పెంచుకున్న రైతులకు నిబంధనల కత్తి మెడపై వేలాడుతోంది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకుని మద్దతు ధర పొందవచ్చని ఆశపడ్డ నిరాశ మిగిలింది. సీసీఐ కొనుగోళ్లలో కొర్రీలు పెడుతుండడంతో రైతులు మళ్లీ దళారులే దిక్కా అనే అయోమయ పరిస్థితిలో పడ్డారు.

ఎకరానికి 7 క్వింటాళ్ల కొనుగోలు పరిమితి

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పత్తి కొనుగోలు కోసం జిన్నింగ్ మిల్లులో సీసీఐ ఐదు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. జిల్లాలో వేములవాడ మండలం నాంపల్లిలో లక్ష్మీ నరసింహ కాటన్ ఇం డస్ట్రీస్, సంకేపల్లిలో లక్ష్మీ ఇండస్ట్రీస్, కోన రావుపేట మండలం సుద్దాలలో శ్రీ కావేరి కాటన్ ఇండస్ట్రీస్, ఇల్లంతకుంట మండ లం తాళ్లపల్లిలో శ్రీ రాజరాజేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్, గాలిపెల్లిలో శ్రీ సప్తగిరి ఇండ స్ట్రీస్‌లో కొనుగోళ్లు మొదలయ్యాయి. గతంలో లేనివిధంగా కొత్తగా కేంద్ర ప్రభుత్వం కపాస్ కిసాన్ యాప్‌ను తీసుకు వచ్చింది. రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తిలో 8 తేమ శాతం కంటే తక్కువ ఉంటే క్వింటాలకు రూ.8110, తేమ 10 శాతం ఉంటే క్వింటాలుకు రూ.7947, తేమ 11శాతం ఉంటే రూ.7866, తేమ 12 శాతం ఉంటే రూ.7785 మద్దతు ధర చెల్లిస్తారు.

గ్రామాల్లో రైతులకు స్మార్ట్‌ఫోన్లు ఉండవు. దీంతో స్లాట్ బుక్ చేసుకోవడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్న సమయంలోనే సీసీఐ పత్తి కొనుగోళ్లలో పరిమితి విధించడం రైతుల్లో ఆందోళన కలిగించింది. గత సంవత్సరం సీసీఐ ఎకరానికి 12 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసింది. ఈసారి ఎకరానికి 7 క్వింటాళ్లకే పరిమితి విధించింది. సీసీఐ నిర్ణయానికి వ్యతిరేకంగా రైతులు, వారికి మద్దతుగా అఖిలపక్ష పార్టీల నాయకులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. వ్యవసాయ శాఖ క్రాప్ బుకింగ్ ఆధారం గానే సీసీఐ, మార్క్‌ఫెడ్ సంస్థలు పంటలను కొనుగోలు చేస్తుంది. వ్యవసాయ శాఖ అంచనాలకు సీసీఐ కొనుగోళ్లకు పొంతన కుదరకపోవడంతో రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

జిల్లాలో 46385 ఎకరాల్లో పత్తి సాగు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 46385 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. గంభీరావుపేటలో 85 ఎకరాలు సాగు చేయగా, ఇల్లంతకుంటలో 12000 ఎకరాలు, ముస్తాబాద్‌లో 530ఎకరాలు, సిరిసిల్లలో 800ఎకరాలు, తంగళ్లపల్లిలో 870ఎకరాలు, వీర్నపలిలో 300ఎకరాలు, ఎల్లారెడ్డిపేటలో 3600 ఎకరాలు, బోయినపల్లిలో 6400 ఎకరాలు, చందుర్తిలో 6200 ఎకరాలు, కోనరావుపేటలో 4800 ఎకరాలు, రుద్రంగిలో 2200 ఎకరాలు, వేములవాడలో 4800 ఎకరాలు,

మిగతా 6వ పేజీలో...

పత్తి రైతుల పాలిట శాపంగా మారిన సీసీఐ నిర్ణయం

- కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం రాజేందర్‌రెడ్డి

ఇల్లంతకుంట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సీసీఐ నిర్ణయం పత్తిరైతులకు శాపంగా మారిందని కాంగ్రెస్‌సెల్ కిసాన్‌సెల్ రాష్ట్రప్రధాన కార్యదర్శి పాశం రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ పెట్టుబడులు అధికం కావడం, భారీ వర్షాలతో పత్తి రైతులు ఇప్పటికే భారగా నష్టపోయారన్నారు. ఎకరానికి 7క్వింటాళ్ల పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుందని పేర్కొనడం సరికాదన్నారు. తెలంగాణలోని భూముల్లో ఎకరానికి 15క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందనే విషయం అధికారులకు తెలిసినా ఇలాంటి నిబంధనలు పెట్టడంలోని ఆంతర్యం ఏమిటన్నారు. సీసీఐ 7కింటాళ్ళు మాత్రమే తీసుకుంటే మిగతా పత్తిని దళారులకు అమ్మినష్టపొమ్మనడమే సీసీఐ విధానామా అని ప్రశ్నించారు. ఇప్పటికే తేమపేరుతో రైతులను ఇబ్బందులు పెడుతున్నారని పేర్కొన్నారు. సీసీఐ వెంటనే తన విధానాన్ని మార్చుకోవాలని పేర్కొన్నారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్

తంగళ్లపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గిరిజన మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు కడార్ల శ్రీలక్ష్మి ఉస్మానియా యూనివర్సిటీ వృక్షశాస్త్రం విభాగంలో డాక్టరేట్ సాధించారు. యూనివర్సిటీ ప్రొఫెసర్ రజని పర్యవేక్షణలో స్టడీఆఫ్ పెస్టిసైడ్ టాలరెంట్ బాక్టీరియా, ఇట్స్ మోడ్ ఆఫ్ యాక్షన్ అండ్ ప్లాంట్ గ్రోత్ ప్రమోటింగ్ యాక్టివిటీస్ అనే అంశంపై పరిశోధన పూర్తిచేసి సిద్ధాంతగ్రంథ సమర్పించారు. కరీనంగర్‌కు చెందిన శ్రీలక్ష్మి ప్రస్తుతం తంగళ్లపల్లి గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. శ్రీలక్ష్మికి డాక్టరేట్ రావడంపై ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

శృంగేరి పీఠాధిపతికి వీడ్కోలు పలికిన విప్



శృంగేరి పీఠాధిపతికి వీడ్కోలు పలుకుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ధర్మవిజయ యాత్రలో భాగంగా రాష్ట్రానికి విచ్చేసిన శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతిస్వామి యాత్రను ముగించుకుని మంగళవారం తిరుగు ప్రయాణమయ్యారు. ఈ సందర్భంగా శంషాబాద్ విమానాశ్రయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆయన తనయుడు కార్తీక్‌లు స్వామి వారికి ఘనంగా వీడ్కోలు పలికారు.

పారదర్శకంగా సీట్లను భర్తీ చేయాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్



సిబ్బందితో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్

సిరిసిల్ల రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో మిగిలిన సీట్ల భర్తీని పారదర్శకంగా చేపట్టాలని ఇన్‌చార్జీ కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆదేశించారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మంగళవారం మిగిలిన సీట్ల భర్తీకి నిర్వహించిన కౌన్సెలింగ్‌ను ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ పరిశీలించారు. సాంఘిక సంక్షేమ గురుకులంలో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగిలిన ఉన్న సీట్ల భర్తీకి ఇటీవల దరఖాస్తులను ఆహ్వానించగా మంగళవారం చేపట్టిన కౌన్సెలింగ్‌ను పర్యవేక్షించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన వివిధ డెస్కులు, సర్టిఫికెట్‌లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల కో-ఆర్డినేటర్ జేజే థేరిస్సా తదితరులు పాల్గొన్నారు.

నేరస్థులకు శిక్ష తప్పదు..

- ఈ ఏడాదిలో 71 కేసుల్లో 82 మందికి జైలుశిక్షలు, జరిమానాలు

- ఎస్పీ మహేష్ బీ గితే



మాట్లాడుతూ ఎస్పీ మహేష్ బీ గితే

సిరిసిల్ల రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో నేరం చేసిన ప్రతి ఒక్కరికి శిక్ష తప్పదని, ఈ సంవత్సరం జిల్లాలో జరిగిన 71 కేసులల్లో 82 మందికి జైలు శిక్షలతోపాటు జరిమానాలను విధించారని ఎస్పీ మహేష్ బీ గితే అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ నేర నియంత్రణ, న్యాయ స్థానాల్లో న్యాయ నిరూపలో జిల్లా పోలీసులు విశేష ఫలితాలను సాధిస్తున్నారన్నారు. ఈ సంవత్సరం జనవరి నుంచి అక్టోబరు వరకు జిల్లా పోలీసు శాఖ సమగ్రంగా వ్యవహరించి న్యాయస్థానాల్లో 71 కేసుల్లో తీర్పులు వెలువడగా, వాటిలో 82 మందికి నేరస్థులకు జైలు శిక్షలు, జరిమానాలను విధించారన్నారు. హత్యకు సంబంధించి మూడుకేసుల్లో ఐదుగురు నిందితులకు జీవిత ఖైదుతోపాటు ఐదు సంవత్సరాల జైలుశిక్ష, నాలుగు కేసుల్లో ఐదుమంది నిందితులకు నాలుగు సంవత్సరాల జైలు శిక్ష, 11 కేసుల్లో 14మందికి మూడు సంవత్సరాల జైలుశిక్ష, రెండు కేసుల్లో ముగ్గురికి రెండు సంవత్సరాల జైలుశిక్ష, 26 కేసుల్లో 28 మందికి ఒక సంవత్సరం జైలు శిక్షలు పడ్డాయన్నారు. అలాగే బ్లోవన్ ఇయర్‌లో 24 కేసులో 26మంది నిందితులకు శిక్షలు పడ్డాయని అన్నారు. సమాజంలో నేరం చేసిన వారు ఎవరు శిక్షనుంచి తప్పించుకోలేరని, పోలీసులు, ప్రాసిక్యూషన్ విభాగం సమన్వయంతో వ్యూహాత్మకంగా విచారణ జరిపి న్యాయం నిరూపణతో శిక్షలు పడేలా చేస్తున్నామన్నారు. జిల్లా ప్రాసిక్యూషన్ అధికారులు, సీఐలు, ఎస్ఐలు ఇన్వెస్టిగేషన్ అధికారులు క్రమం తప్పకుండా కేసుల పురోగతిని సమీక్షిస్తూ తీర్పులు శిక్షలు రూపంలో రావడమే లక్ష్యంగా కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజలు పోలీసులపై నమ్మకం ఉంచి చట్టం పాటించేలా సహకరించాలని కోరారు.

విద్యార్థులను ప్రోత్సహించాలనే సైకిళ్ల పంపిణీ

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి

ఇల్లంతకుంట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి పేర్కొన్నారు. మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాల ఆవరణలో మంగళవారం విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బండి సంజయ్ కుమార్ జన్మదినం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మోదీ కానుక ఇవ్వాలని తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. పేదరిక విద్యార్థిగా ప్రస్థానం ప్రారంభించిన సంజయ్‌కుమార్ కేంద్రమంత్రి స్థాయికి ఎదగడాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కరీంనగర్ పార్లమెంటు పరిధిలో 20వేల సైకిళ్లను పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు మోదీ కిట్ పేరుతో సహాయాన్ని అందించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి సంజయ్‌కుమార్‌కు రిటర్న్‌గిఫ్ట్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఈఓ లక్ష్మీరాజం, ఎంపీడీవో శశికళ, ఎంఈవో చెప్యాల శ్రీనివాస్, ఎస్సై అశోక్, సీపీడీవో రోజ, ప్రధానోపాధ్యాయులు ప్రేమలత, శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్, నాయకులు గుజ్జ శ్రీనివాస్, అడిచెర్ల రాజు, మండల ఇన్‌చార్జి సంఘ నరేష్, రిటైర్డ్ తహసీల్దార్ సామ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎల్లారెడ్డిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి పరామర్శించారు. మండలంలోని బండలింగంపల్లిలో బీజేపీ కార్యకర్త తుమ్మల నరేశ్ గుండెపోటుతో మృతిచెందగా మంగళవారం ఆయన నివాళులర్పించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నాయకులు ఆంజనేయులు, మహేశ్, బాలగౌడ్, రంజిత్‌కుమార్, చరణ్‌గౌడ్, రాజు, దయాకర్ పాల్గొన్నారు.

ప్రైవేటు కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి పుష్పలత



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి పుష్పలత

సిరిసిల్ల రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేకం లోక్‌అదాలత్‌లో ప్రైవేటు ఫిర్యాదు కేసులు, పాత కేసుల పరిష్కారంపై దృష్టి పెట్టాలని జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి బి. పుష్పలత కోరారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో మంగళవారం బార్‌అసోసియేషన్ న్యాయవాదులతో స్పెషల్ లోక్ అదాలత్‌పై సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ఈనెల 15వ తేదీన కోర్టులలో నిర్వహించే ప్రత్యేక లోక్‌అదాలత్‌లో ప్రజల మేలు కోసం పాత కేసులు పరిష్కారంపై ప్రత్యేకదృష్టి సారించాలని పెండింగ్‌లో ఉన్న చిన్న క్రిమినల్ కేసులు, ఇతర కంపొండబుల్ కేసులను ఆధునిక పద్ధతుల్లో సమర్థవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక లోక్‌అదాలత్ ఉపయోగపడుతుందన్నారు. కోర్టులపై కేసుల భారాన్ని తగ్గించడంతో పాటు ప్రజలకు త్వరగా న్యాయం అందేలాచర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్, సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు జూపెల్లి శ్రీనివాసరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేశ్

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు4(ఆంధ్రజ్యోతి): కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ నగేశ్ అన్నారు. వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. కేంద్రంలోని రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తేమ శాతం వచ్చిన వెంటనే తూకం వేయాలని నిర్వాహకులకు సూచించారు. కేంద్రాన్ని గత 15 ఏళ్లుగా నిర్వహిస్తున్న రెండు గ్రామైఖ్య సంఘాలు కొనుగోళ్లకు సంబంధించిన లెక్కలు చూపకపోవడం వల్ల గత కొంత కాలంగా గ్రామైఖ్య సంఘం సభ్యులు, రైతుల మధ్య గొడవలు జరుగుతున్నాయని ఫిర్యాదుతో ఆరా తీశారు. లెక్కలపై ఎందుకు వాగ్వివాదం చోటు చేసుకుంటుందని ఇరు వర్గాలను ద్వారా తెలుసుకున్నారు. సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని అన్నారు. ఈనెల 15న గ్రామైఖ్య సంఘం సభ్యులు, రైతులు సమావేశమై లెక్కలపై చర్చించుకోవాలని సూచించారు. అడవిపదిర గ్రామానికి వెళ్లే రహదారిపై అర్ధంతరంగా నిలిచిపోయిన వంతెన నిర్మాణాన్ని పరిశీలించారు. ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. రహదారి పైన తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగల వల్ల ప్రమాదం పొంచి ఉందని వాటిని సరి చేయాలని సెస్ అధికారులకు సూచించారు. ప్రజలకు అన్ని వసతులు కల్పించి సమస్యలను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అన్నారు.

ఆయన వెంట ఆర్డీవో వెంకటేశ్వర్లు, డీఆర్‌డీవో శేషాద్రి, తహసీల్దార్ ముక్తార్‌పాషా, ఐకేపీ ఏఎంపీ సుదర్శన్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

జిల్లా స్థాయి యోగా పోటీల్లో విద్యార్థుల సత్తా



జిల్లా స్థాయి యోగా పోటీల్లో సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సరిసిల్ల పట్టణంలోని ఆర్యవైశ్య భవనంలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీలలో విద్యార్థులు సత్తాచాటారు. ఉదయం జిల్లా స్థాయి యోగా పోటీలను సిరిసిల్ల పట్టణ సీఐ కృష్ణ ప్రారంభించారు. జిల్లా యోగా ఆసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో పలు మండలాల నుంచి మొత్తం విద్యార్థులు 112మంది పాల్గొని ప్రతిభను కనబరిచారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. సాయంత్రం విజేలైన విద్యార్థులకు ముఖ్య అతిథి జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్ మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీకుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, సీనియర్ యోగా సాధకులు బొర్ర అశోక్, పీ దేవయ్య, వినోద్, జ్యోతి, లావణ్య, రామకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయుడు దేవత ప్రభాకర్ పాల్గొన్నారు.

అవగాహనతో క్షయ వ్యాధి నివారణ : డీఎంహెచ్‌వో



పౌష్టికాహార కిట్టును అందజేస్తున్న జిల్లా వైద్యాధికారి రజిత

ఎల్లారెడ్డిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే క్షయ వ్యాధిని నివారించవచ్చని జిల్లా వైద్యాధికారి రజిత అన్నారు. ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధిగ్రస్తులకు మంగళవారం ఆమె బలవర్ధక ఆహార కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి రజిత మాట్లాడుతూ క్షయ రహిత గ్రామపంచాయతీలే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. గ్రామాల్లో వ్యాధిగ్రస్తులను గుర్తించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ముస్తాబాద్ పీపుల్స్ ఆసుపత్రి వైద్యుడు శంకర్ సమకూర్చిన పౌష్టికాహారం కిట్లను అందజేశామని రజిత పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో టీబీ ప్రోగ్రాం అధికారి అనిత, వైద్యాధికారి సారియాఅంజుమ్, సీహెచ్‌వో బాలచందర్, సూపర్‌వైజర్ మహిపాల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సన్నిధిలో కార్తీక సందడి

- బద్దిపోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించిన భక్తులు



బద్దిపోచమ్మ దేవాలయం ఎదుట కిక్కిరిసిన భక్తులు

5

అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు ఉపకరణాలు

- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్

6

పొన్న సేవపై రాజన్న దర్శనం



పొన్న సేవపై దర్శనమిస్తున్న స్వామివారు

వేములవాడ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వేములవాడలోని రాజరాజేశ్వర స్వామివారు పొన్న సేవపై దర్శనం ఇచ్చారు. మంగళవారం రాత్రి పొన్న సేవ వాహనంపై హరిహరులు వేములవాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తుండగా భక్తులు దర్శించుకున్నారు. వైకుంఠ చతుర్దశి సందర్భంగా పంచ పనిషత్తుల ద్వారా అనంత పద్మనాభ స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం సుబ్రమణ్య స్వామివారికి అర్చకులు మహాపూజ చేశారు. అనంతరం భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సామూహిక దీపోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తిగీతాలు, భజనలతో భక్తులను అలరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రమాదేవి, ఈఈ రాజేష్, ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్, ఏఈ రామకృష్ణ, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్ ఎడ్ల శివ సాయి, చింతపంటి కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై కారు బీభత్సం

● తప్పిన ప్రమాదం



శంకరపట్నంలో షాపులోకి దూసుకెళ్లిన కారు

శంకరపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండల కేంద్రంలో జాతీయ రహదారిపై కారు బీభత్సం సృష్టించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వైపు వెళ్తున్న కారు కేశవపట్నం రాగానే రహదారి పక్కకు దూసుకెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి పక్కన ఉన్న షాపుల్లోకి దూసుకెళ్లింది. కారు వేగంగా దూసుకెళ్లడంతో విద్యుత్ స్తంభం విరిగింది. విద్యుత్ వైర్లు తెగి కింద పడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అంతటితో ఆగకుండా పక్కన ఉన్న కిరాణం, స్వీట్ హౌస్ షాపులోకి దూసుకెళ్లింది. కారు ఢీ కొట్టడంతో షాపుల ముందు ఉన్న ద్విచక్ర వాహనం ఇతర సామగ్రి ధ్వంసమైంది. రోడ్డుపై ప్రజలు ఎవరూ లేకపోవడం వల్ల పెను ప్రమాదం తప్పింది. కారు బెలూన్లు తెరుచుకోవడంతో కారులో ఉన్న వారు సురక్షితంగా బయటపడ్డట్లు స్థానికులు తెలిపారు.

కారును ఢీ కొన్న డీసీఎం వ్యాన్

శంకరపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్ శివారులో కారును వెనుక నుంచి డీసీఎం వ్యాన్ ఢీకొన్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వైపు వెళ్తున్న కారును మొలంగూర్ ఎక్స్‌రోడ్ అండర్ పాస్ వద్ద డీసీఎం వ్యాన్ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు వెనుక భాగం పాక్షికంగా ధ్వంసమైంది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరికి గాయాలు

వేములవాడ రూరల్ నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. చందుర్తి మండలం మూడపల్లి గ్రామం చెందిన సంటి దేవయ్య అనే వ్యక్తి పనిపై హన్మాజీపేటకు వచ్చి తిరిగి మూడపల్లికి వెళుతుండగా ఎదురుగా మరొక ద్విచక్ర వాహనం ఢీకొనడంతో దేవయ్యకు గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం వేములవాడలోని ఏరియా ఆసుపత్రికి రుద్రంగి ఈఎంటి ప్రశాంత్‌కుమార్, పైలెట్ నరేందర్ తరలించారు.

అరకొర వసతులతో ఇక్కట్లు

- కోరుట్ల ఆసుపత్రిని 100 పడకలుగా అప్‌గ్రేడ్ చేసినా ఫలితం శూన్యం
- వేధిస్తున్న వైద్యుల కొరత
- అల్ట్రాసౌండ్ స్కానింగ్ లేక గర్భిణుల అవస్థలు



కోరుట్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి



నిరుపయోగంగా మారిన ఆక్సిజన్ ప్లాంట్

కోరుట్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోరుట్లలో పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు గత ప్రభుత్వం 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినా అరకొర వసతులతో ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదు. ఆసుపత్రిలో అత్యవసర వైద్యసేవలు అందకపోవడంతో క్షతగాత్రులు జగిత్యాల, కరీంనగర్, నిజామాబాద్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న క్రమంలో మృతిచెందిన సందర్భాలు ఉన్నాయి.

● రూ.12.50 కోట్లతో ఏరియా ఆసుపత్రి అప్‌గ్రేడ్

కోరుట్ల నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా గత ప్రభుత్వం రూ.12.50 కోట్లు నిధులతో 100 పడుకల ఆసుపత్రిగా మార్చేందుకు భవన నిర్మాణం చేసింది. పట్టణంలో జీ ప్లస్ త్రీ భవన సముదాయాన్ని నిర్మించారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి మంత్రి తన్నీర్ హరీశ్‌రావు చేతుల మీదుగా అప్పటి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఆధ్వర్యంలో 100పడకల ఆసుపత్రిని ప్రారంభింపజేశారు.

● ముఖ్యమైన విభాగాలకు వైద్యులు కరువు

ఏరియా ఆసుపత్రిలో 28 మంది వైద్యులు కావాల్సి ఉండగా 15 మంది వైద్యులు మాత్రమే ఉన్నారు. ఆసుపత్రిలో ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, అదనపు గైనకాలజిస్ట్ అవసరం ఉంది. ఉన్న డాక్టర్లకు సరైన వైద్య పరికరాలు అందుబాటులో లేకపోవడంతో ప్రాథమిక చికిత్స మాత్రమే నిర్వహిస్తున్నారు. కొత్తగా టీ హబ్ ఏర్పాటు చేసి 130 పరీక్షలు చేస్తున్నా స్టేషనరీ కొరత కారణంగా రోగుల సెల్‌ఫోన్లకు వైద్యసిబ్బంది రిపోర్టులను పంపుతున్నారు.

● ప్రతి రోజు 400కు పైగా ఓపీ

ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి రోజు 400కు పైగా రోగులు వైద్య పరీక్షలకు వస్తున్నారు. గర్భిణులకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రిలో స్కానింగ్ మిషన్ లేకపోవడంతో గర్భిణులు ప్రైవేట్‌కు వెళ్లాల్సి వస్తోంది.

● మూలనపడిన వైద్య పరికరాలు

సిబ్బంది కొరతతో ప్రభుత్వం మంజూరు చేసిన వైద్య పరికరాలు మూలన పడ్డాయి. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు అందించే ఆక్సిజన్ పీఎస్‌ఏ ప్లాంట్, ఫ్రాక్చర్‌లను గుర్తించేందుకు ఉపయోగించే సీ-ఆర్మ్ ఎక్స్‌రే ఆర్థోమిషన్ నిరుపయోగంగా మారాయి. రూ.25 లక్షల విలువైన ఆక్సిజన్ పరికరాలు దవాఖాన ఆవరణలో ఉండడంతో అవి తుప్పపడి పోయే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు శ్రద్ధ చూపి ఏరియా ఆసుపత్రిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి పేద ప్రజలకు వైద్య సేవలకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదికలు పంపాం

- సునితారాణి,సూపరింటెండెంట్, కోరుట్ల ఏరియా ఆసుపత్రి



ఏరియా ఆసుపత్రి అవసరాలపై వైద్య శాఖ ఉన్నతాధికారులతో పాటు ప్రభుత్వానికి నివేదికలను పంపించాం. ప్రస్తుతం ఆసుపత్రిలో ఉన్న సిబ్బందితో అన్ని రకాల వైద్యసేవలను అందిస్తున్నాం.

మౌలిక వసతులు కల్పించాలి

-పెండం గణేష్, బీజేపీ మాజీ కౌన్సిలర్,



పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించి నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించాలి. ఆసుపత్రిని 30 పడకల నుంచి వంద పడకలుగా మార్చినా పూర్తి స్థాయిలో వైద్యులను నియమిస్తేనే పేదలకు మెరుగైన వైద్యం అందుతుంది.

బహ్రెయిన్‌లో అంత్యక్రియల నిర్వహణకు అంగీకార పత్రం

ఇబ్రహీంపట్నం, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): బహ్రెయిన్‌లో మృతిచెందిన గల్ఫ్ కార్మికుడు శ్రీపాద నరేష్ అంత్యక్రియలు అక్కడే నిర్వహించేందుకు మృతుడి భార్య అంగీకారం పత్రాన్ని సీఎం ప్రవాసి ప్రజావాణిలో కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కు మంగళవారం అందించారు. మెట్‌పల్లి పట్టణానికి చెందిన గల్ఫ్ కార్మికుడు శ్రీపాద నరేష్ ఐదేళ్ల క్రితం బహ్రెయిన్‌లో మృతిచెందాడు. ఈ మేరకు ఆయన మృతదేహం అక్కడే భద్రపరచగా, ఇక్కడికి తీసుకువచ్చేందుకు వీలు లేకుండా పోయింది. దీంతో అక్కడే అంత్యక్రియలు నిర్వహించేందుకు అంగీకారం పత్రం మీద నరేష్ భార్య లత సంతకం చేశారు. కార్యక్రమంలో ఎన్నారై అడ్వయిజరీ కమిటీ సభ్యులు నండి దేవేందర్ రెడ్డి, సింగిరెడ్డి నరేష్ రెడ్డి, సామాజిక సేవకులు మొరపు తేజ, ఆకుల ప్రవీణ్, బొజ్జ అమరేందర్ పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితుడి అరెస్ట్

ధర్మపురి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలం రామయ్యపల్లె గ్రామంలో పరమాల భీమయ్య అనే వ్యక్తిపై గొడ్డలితో దాడి చేసిన కేసులో నిందితుడు పందిరి భీమయ్యను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ గ్రామానికి చెందిన పందిరి భీమయ్య ఈ నెల1న పరమాల భీమయ్యపై గొడ్డలితో దాడిచేసి చంపే ప్రయత్నం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 3న ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు పందిరి భీమయ్యను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

శతాధిక వృద్ధురాలు మృతి

ఎల్లారెడ్డిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్‌లో శతాధిక వృద్ధురాలు చెట్టిపల్లి లక్ష్మమ్మ(102) మంగళవారం మృతిచెందిందని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు. ఇటీవల లక్ష్మమ్మ అనారోగ్యంతో బాధపడుతూ చనిపోయిందని పేర్కొన్నారు.

ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

● ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు 20 మంది ప్రయాణికులకు గాయాలు ● బస్సు వేగమే ప్రమాదానికి కారణం



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు



అంబులెన్స్‌లో క్షతగాత్రుల తరలింపు

తిమ్మాపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధాన్యంలోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు ఆర్టీసీ బస్సులోని 20 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణికుంట వద్ద రాజీవ్‌రహదారిపై మంగళవారం ఉదయం 4.50 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. తిమ్మాపూర్ మండలం నేదునూర్ గ్రామానికి చెందిన ఎలుగందుల రవీందర్ ధాన్యం బస్తాల లోడుతో ట్రాక్టర్‌ను రైస్ మిల్లుకు తరలిస్తున్నాడు. రాజీవ్ రహదారిపై రేణికుంట వద్ద జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తుండగా ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ రోడ్డు పక్కన పల్టీకొట్టింది. ట్రాక్టర్ డ్రైవర్ దూకేయడంతో గాయాలతో బయటపడ్డాడు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 31 మంది ప్రయాణికులు ఉండగా డ్రైవర్‌తో పాటు బస్సులో ప్రయాణిస్తున్న 20 మందికి గాయాలైనట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రమాదానికి ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ప్రయాణికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సంఘటన స్థలాన్ని కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్ కుమార్, తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్ పరిశీలించారు.

అక్కాచెల్లెళ్లపై దాడి

● నిందితుడి రిమాండ్

మల్యాల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): డీజేతో ఇబ్బందులు పడుతుండడంతో సౌండ్ సిస్టం నిలిపివేయాలని అన్నందుకు అక్కాచెల్లెళ్లపై దాడికి పాల్పడిన రాజు అనే యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. గత నెల 30న మల్యాలకు చెందిన రుద్రవేణి నర్సయ్య చిన్న కొడుకు సంజీవ్ వివాహం జరిగింది. అనంతరం నర్సయ్య, అతడి తమ్ముడు పోచయ్య ఇళ్ల మధ్య గల సందులో డీజే పెట్టి నృత్యాలు చేశారు. దీంతో పోచయ్య ఇద్దరు కూతుళ్లు, నర్సయ్య మరో కొడుకు రాజును బాక్సులు తీయమని, తమకు అసౌకర్యంగా ఉందని కోరారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య గొడవ జరగ్గా ఆదివారం రాజు, అతడి కుటుంబ సభ్యులు కలిసి తన చిన్నాన్న పోచయ్య ఇంటికి వెళ్లి అక్కాచెల్లెలపై దాడి చేయడంతో తీవ్రగాయాల పాలయ్యారు. ఇందులో ఒకరు గర్భిణి కాగా బాధితుల ఫిర్యాదు మేరకు రాజు, అతడి కుటుంబ సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం రాజును రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వేధిస్తోందని రాస్తారోకో



మెట్‌పల్లిలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థినులు

మెట్‌పల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాధురి వేధిస్తోందని మంగళవారం విద్యార్థినులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ మీకు తిండి దండగ.. చదువుకు పనికిరారని అంటూ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాటలతో వేధిస్తోందని ఆరోపించారు. వెంటనే ఆమెను విధుల నుంచి తొలగించాలని విద్యార్థినులు డిమాండ్ చేశారు. రహదారిపై ట్రాఫిక్‌జామ్ కావడంతో పోలీసులు విద్యార్థినులకు నచ్చజెప్పినా వినకపోవడంతో ఆర్‌డీఓ పూర్ణచందర్‌కు సమాచారం అందించారు. ఆర్‌డీఓ సంఘటనా స్థలానికి వచ్చి విద్యార్థినులను సముదాయించే ప్రయత్నం చేసినా వినకపోవడంతో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాధురి సెలవు పెట్టి కళాశాల నుంచి వెళ్లిపోయారు. దీంతో ఆందోళన విరమించారు.

రెస్టారెంట్లపై మున్సిపల్ అధికారుల దాడులు

కోరుట్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని రెస్టారెంట్లు, స్వీట్ హోం, హోటల్స్‌పై మంగళవారం మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. రెస్టారెంట్లు, స్వీట్ హోం, హోటల్స్‌లో నిలువ ఉన్న ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకొని జరిమానా విధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రవీందర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మహేష్, రికార్డు అసిస్టెంట్ జగదీష్, వార్డు ఆఫీసర్లు హేమంత్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

గన్నేరువరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలు తెగిపడి విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందింది. మండల కేంద్రానికి చెందిన రైతు బండపల్లి మనోహర్‌కు చెందిన పాడిగేదెను మంగళవారం తన వ్యవసాయ పొలం వద్ద కట్టివేయగా అక్కడే విద్యుత్ స్తంభానికి లూజుగా ఉన్న విద్యుత్ తీగలు తెగి గేదెపై పడడంతో తన గేదె మృతి చెందినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. జీవనాధారమైన గేదె మృతి చెందడంతో 70 వేల రూపాయల ఆర్థిక నష్టంతో పాటు బతుకుదెరువు పోయిందని విద్యుత్ శాఖ అధికారులు తనను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

అదృశ్యమైన వృద్ధుడి మృతదేహం లభ్యం

కోనరావుపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : అదృశ్యమైన వృద్ధుడు బద్దెపూరి నారాయణ(80) మల్కపేట రిజర్వాయర్‌లో మంగళవారం శవమై కనిపించాడు. కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన బద్దెపురి నారాయణ అక్టోబరు 31న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుమారుడు నవంబరు 3వ తేదీన తన తండ్రి కనిపించడం లేదని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని తెలిపారు. కాగా మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. మంగళవారం కుటుంబ సభ్యులకు మల్కపేట రిజర్వాయర్ నీటిలో ఒడ్డుకు శవంలా కొట్టుకువచ్చి కనిపించగా పోలీసులకు సమాచారం అందించారన్నారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మతిస్థిమితం లేదని, ఈతరాక అందులో పడి చనిపోయి ఉండవచ్చని, తమకు ఎవరిపైనా అనుమానం లేదని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు.

తేనెటీగల దాడిలో ఇద్దరు రైతులకు గాయాలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తేనెటీగలు దాడి చేసిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లిలోని రైతులు కొప్పుల రవీందర్‌రెడ్డి, కుందనపల్లి రవీందర్‌రెడ్డి మంగళవారం తీవ్ర గాయాల పాలయ్యారు. వారిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కుందనపల్లి రవీందర్‌రెడ్డి తన వ్యవసాయ పొలంలోని వ్యవసాయ బావి చుట్టూ ఉన్న చెట్లను జేసీబీ వాహనంతో తొలగించే పనులను చేపట్టాడు. మామిడి చెట్టుకు ఉన్న తేనేటీగలు ఒక్కసారిగా కుందనపల్లి రవీందర్‌రెడ్డితో పాటు అక్కడే ఉన్న కొప్పుల రవీందర్‌రెడ్డిపై దాడి చేశాయి. భయంతో జేసీబీ డ్రైవర్, మరో వ్యక్తి వాహనంలో అద్దాలను వేసుకోవడం వల్ల ప్రమాదం తప్పినట్లయింది. కొప్పుల రవీందర్‌రెడ్డి పరిస్థితి విషమంగా మారడంతో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఏసీబీ తనిఖీలపై దేవాదాయశాఖ ఆరా..

వేములవాడ టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గతంలో వేములవాడ రాజన్న ఆలయంలో ఏసీబీ తనిఖీల వ్యవహారంపై రాష్ట్ర దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఆరా తీశారు. ఆలయంలో 2024 ఆగస్టులో జరిగిన ఏసీబీ తనిఖీలకు సంబంధించి కార్యనిర్వహణ అధికారిగా ఉన్న వినోద్‌రెడ్డిని బదిలీచేసి, మిగతా ఉద్యోగులకు నోటీసులు జారీ చేశారు. రాజన్న ఆలయంలో 15 మాసాల క్రితం జరిగిన ఏసీబీ తనిఖీల వ్యవహారం మరోసారి వెలుగులోకి రావడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది.

ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్యాయత్నం

● ప్రిన్సిపాల్ కొట్టాడని మనస్థాపం ● పాఠశాల ఎదుట విద్యార్థి సంఘాల బైఠాయింపు

జమ్మికుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రిన్సిపాల్ కొట్టాడని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన ఇద్దరు తొమ్మిదవ తరగతి విద్యార్థులు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని స్వామి వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన జరుగగా మంగళవారం ఉదయం వెలుగు చూసింది. కరీంనగర్ జిల్లా వీణవంక మండల కేంద్రానికి చెందిన చరణ్‌కుమార్, రామ్‌చరణ్ జమ్మికుంటలోని ఎస్వీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నారు. ఆదివారం హాస్టల్ టెర్రస్‌పై చరణ్‌కుమార్, రామ్‌చరణ్‌తో పాటు మరొక స్నేహితుడు సిగరేట్ తాగుతున్నట్లు గమనించిన వార్డెన్ మరుసటి రోజు సోమవారం ప్రిన్సిపాల్‌కు విషయం చెప్పింది. ప్రిన్సిపాల్ విద్యార్థులను పిలిచి చేయి చేసుకుని గట్టిగా మందలించాడు. మీ తల్లిదండ్రులకు చెప్పి టీసీ ఇప్పించి స్కూల్ నుంచి పంపిస్తానని హెచ్చరించాడు. ముగ్గురు విద్యార్థుల్లో ఒకరు పాఠశాలలో చెప్పాపెట్టకుండా ఇంటికి వెళ్లిపోయాడు. మనస్థాపం చెందిన చరణ్‌కుమార్, రామ్‌చరణ్ బయటకు వెళ్లి గడ్డి మందు తెచ్చుకుని హాస్టల్‌లోనే ఓ గ్లాసు నీళ్లలో కలుపుకుని తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. విషయం తెలుసుకున్న పాఠశాల యాజమాన్యం చికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపతిక్రి తరలించి వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ ఆసుపత్రికి చేరుకుని విచారణ చేపట్టారు. పాఠశాల ఎదుట విద్యార్థి సంఘాల నాయకులు బైఠాయించి ఆందోళనకు దిగారు. పాఠశాల యాజమాన్యంతో పాటు ప్రిన్సిపాల్, వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హుజూరాబాద్ ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పద్మసాయిశ్రీ ఆసుపత్రికి చేరుకుని విద్యార్థుల నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో హంగామా

చందుర్తి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర చెందిన ఓ కూలీ రోడ్డుపై వెళ్తున్న వాహనదారులపై దాడికి యత్నిస్తూ హంగామా సృష్టించాడు. ఈ సంఘటన చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసుల, స్థానికుల కథనం ప్రకారం.. మర్రిగడ్డ గ్రామంలో మహారాష్ట్రకు చెందిన కూలి పనిచేసే కలబండే పండిత్ అనే వ్యక్తి మద్యం మత్తులో ప్రధాన రహదారిలో వెళ్లే వాహనదారులతో పాటు నడుచుకుంటూ వెళ్లే వారిపై దాడికి యత్నించాడు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకొని పండితును అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పండిత్‌ను పనిచేస్తున్న సంబంధిత యజమానికి అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్‌ల పట్టివేత

కరీంనగర్ క్రైం, నవంబరు4 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుం డా కరీంనగర్ రూరల్ మండలంలో ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బొమ్మకల్ శివారులోని మానేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. డ్రైవర్లపై కేసు నమోదు చేశామన్నారు.

వీణవంక : మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పోలీసులు పట్టుకు న్నారు. మానకొండూరు మండలం వేగురుపల్లి, ఊటూరు గ్రామాలకు చెందిన బుర్ర అరవింద్, కోట సంపత్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆవుల తిరుపతి తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి



రౌతు గంగాధర్ (ఫైల్)

జగిత్యాలరూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల అర్బన్ మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన రౌతు గంగాధర్ అలియాస్ ఆలూరి రెడ్డి (35) అనే యువకుడు నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలంలోని పడకాల గ్రామంలో అనుమానాస్పదస్థితిలో మంగళవారం మృతిచెందాడు. రౌతు గంగాధర్ గ్రామంలో కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. ఇటీవలే నిజామాబాద్ జిల్లాలోని వేల్పూర్ మండలంకు పని నిమిత్తం వెళ్లాడు. ఈ క్రమంలోనే గంగాధర్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. శరీరంపై తీవ్రగాయాలు ఉండటం వల్ల మృతుడి బంధువులు యువకుడి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి సోదరుడు శేఖర్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నదిలో గల్లంతైన సాయికృష్ణ మృతదేహం లభ్యం

● అన్నారం బ్యారేజీ నీటి ప్రవాహంలో గుర్తింపు



సాయికృష్ణ (ఫైల్)

మంథని, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మంథని గోదావరినదిలో గల్లంతైన రావికంటి సాయికృష్ణ (30) అనే యువకుడి మృతదేహం భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అన్నారం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహంలో మంగళవారం తేలింది. స్థానిక పాత బస్టాండ్ ఏరియాకు చెందిన సాయికృష్ణ సోమవారం ఉదయం మంథని గోదావరి నదిలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటి ప్రవాహంలో మునిగిపోయారు. కుటుంబ సభ్యుల సమాచారంతో పోలీసు, ఫైర్, రెవెన్యూ, మున్సిపల్ శాఖ ఆధికారులు సోమవారం సాయంత్రం వరకు మంథని నది తీరంలో గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు. మంగళవారం అన్నారం బ్యారేజీ వద్ద గుర్తు తెలియని శవం తేలిందని సమాచారంతో పోలీసు, ఫైర్, కుటుంబ సభ్యులు అక్కడి వెళ్లి చూసి సాయికృష్ణగా గుర్తించారు. మంథని ఎస్‌ఐ-2 సాగర్, ఫైర్ ఆఫీసర్ శివశంకరప్రసాద్, భూపాలపల్లి ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌లు సాయికృష్ణ మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని రాత్రి మంథనికి తరలించారు. మృతదేహం లభ్యమైనట్లు సమాచారం అందటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్వగ్రామానికి చేరిన గల్ఫ్ కార్మికుడి మృతదేహం



సతీష్ (ఫైల్)

రుద్రంగి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన ఓ కార్మికుడు గుండె పోటుతో మృతిచెందగా, మంగళవారం అతడి మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన మర్రిపల్లి సతీష్(38) అనే వ్యక్తి ఉపాధి కోసం మస్కట్ దేశం వెళ్లాడు. నాలుగు రోజుల క్రితం గుండెపోటు రావడంతో మరణించాడు. మృతుడికి భార్య లావణ్య, కూతురు, కూమారుడు ఉన్నారు.

ధర్మపురిలో ఘనంగా గోదావరి హారతి



ధర్మపురి వద్ద గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 14వ రోజు మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, శారదా మహిళా మండలి సభ్యులు, మహిళలు మంగళ వాయిద్యాలు వెంటరాగా సాయంత్రం గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి నది వద్ద విశేష పూజలు నిర్వహించారు. రాత్రి వేళలో మహిళలు దొప్పల్లో దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, సూప రింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివా సాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, ఆలయ అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, రాజగోపాల్, ధర్మకర్తలు రాపర్తి సాయికిరణ్, ఒజ్జల సౌజన్యనరేందర్, స్తంభంకాడి గణేష్, గుడ్ల రవీందర్, పాల్గొన్నారు.



గోదావరిలో కార్తీక దీపాలు వదులుతున్న మహిళలు

రాజన్న భక్తులకు రక్షణేది?

- కార్తీక మాసంలో భక్తుల రద్దీ
- క్యూలైన్లలో తోపులాటలు..
- జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసుల లేఖ



బద్దిపోచమ్మ ఆలయం క్యూలైన్‌లో కిక్కిరిసిన భక్తజనం

వేములవాడ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజేశ్వరస్వామి దేవాలయంలో భక్తు లకు రక్షణేదనే సందేహం నెలకొంది. రాజన్న సన్నిధిలో విస్తరణ పనుల నేపథ్యంలో కార్తీకమాసం సందర్భంగా ఆలయంలో స్వామివారి లఘు దర్శనం కల్పించారు. అనుబంధ దేవాలయమైన భీమేశ్వరాల యంలో ఆర్జిత పూజలు కొనసాగుతున్నాయి. మరో వైపు బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయంలోనూ రద్దీ నెలకొంటోంది. శుక్ర, ఆది, సోమ వారాల్లో భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించు కుంటున్నారు. శ్రీ భీమేశ్వరాల యంలో ఆర్జిత పూజలు, కోడెల మొక్కులు కొనసా గుతున్నందున భక్తులు తాకిడి పెరిగింది. కోడెల క్యూలైన్‌లో భక్తులు తోసుకోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. భక్తుల మధ్య వాగ్వాదం ఏర్పడు తోంది. సోమవారం ఆర్జిత సేవ అయిన కల్యాణం టికెట్ల కోసం వేచిఉన్న భక్తులు ఒక్కసారి తోసుకోవ డంతో క్యూలైన్ స్టీల్ బారీకేడ్స్ వంగిపోయాయి. మంగళవారం బద్దిపోచ మ్మ అమ్మవారికి బోనం సమర్పించేందుకు భక్తులు తీవ్ర ఇబ్బందులకు గుర య్యారు. రానున్న రోజుల్లో భక్తులు అధికసంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. రాబోయే సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా వేములవాడ భక్తజన సందోహంతో నిండిపోనుంది. దీంతో రాజన్న సన్నిదికి వచ్చే భక్తుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది.

• ముందస్తు జాగ్రత్తలపై పోలీసుల లేఖ

కార్తీక మాసం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి వచ్చే భక్తులకు తగిన భద్రత ఏర్పాట్లపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఇటీవల ఆలయ ఈవోకు పోలీసులు లేఖ రాశారు. విస్తరణ పనుల దృష్ట్యా ఏదైనా కూల్చివేతలు చేపడితే ముందస్తు సమాచారం ఇవ్వాలని సూచించారు. తమకు తెలియకుండా ఆలయ విస్తరణ పనుల్లో భాగంగా కూల్చివేతలు చేపడితే ఇబ్బందులు తలెత్తుతాయని, ఇటీవల ఆలయంలో ఒక ప్రాంతం కూల్చివేత సందర్భంగా పోలీస్ ఉన్నతాధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా మొదలు పెట్టాలని చూడడంతో వివాదాస్పదమైంది. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకూడదని పోలీసు అధి కారులు హెచ్చరించినట్లు తెలిసింది. ఆలయంలో ఏదైనా సంఘటనలు జరిగితే బాధ్యులు ఎవరని ప్రశ్నించినట్లు సమాచారం. కార్తీకమాసం సంద ర్భంగా రాజరాజేశ్వరాలయం, భీమేశ్వరాల యంలోనూ కిటకిటలా డుతున్నాయి. ఈ సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులు లేఖ రాశారు. ప్రధానంగా క్యూలైన్‌లో వ్యతిరేక దిశలో ప్రవేశించకూడదు. ముందు, వెనుక ఉన్న భక్తులు నెట్టకుండా ఉండాలి. క్యూలైన్లలో పరుగులు తీయడం, తోసుకోవడం చేయకుండా భక్తులు వెళ్లాలి. క్యూలైన్‌లలో రద్దీగా ఉన్నపుడు భక్తులు సహనంతో వేచిఉండాలి. క్యూలైన్‌ల వద్ద డ్యూటీలో ఉన్న సిబ్బంది సూచనలు, సలహాలు పాటించాలి. రద్దీ ప్రదేశాల్లో భక్తులు గుంపులుగా ఉండకూడదు. ఏదైనా తొక్కిసలాట, తోపులాటల పరిస్థితులు ఉంటే వెంటనే భక్తులు దూరంగా వెల్లాలి.



కల్యాణం టికెట్ల కౌంటర్ వద్ద ఒరిగిన క్యూలైన్ స్టీల్ బారికేడ్స్

కల్యాణం టికెట్ కౌంటర్ మార్చుతాం..

- ఆలయ ఈఈ రాజేష్

భీమేశ్వరాలయంలోని కల్యాణం టికెట్ బుకింగ్ కౌంటర్ మార్చుతాం. సోమవారం భక్తులు తోసుకోవడాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రచార రథం వైపు బుకింగ్ కౌంటర్ మార్చడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. మెయిన్ టెంపుల్ క్యూలైన్‌ను పటిష్టం చేస్తాం. భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటే వెంటనే చర్యలు తీసుకుంటాం.

7న సీనియర్ వాలీబాల్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి సీనియర్ వాలీబాల్ ఎంపిక పోటీలను ఈ నెల 7న కొత్తపల్లి మండలం ఎలగందులలో నిర్వహించనున్నట్లు వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ వేణు కిషన్‌రావు, గిన్నె లక్ష్మణ్ తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచినవారిని ఈ నెల 13 నుంచి 16 వరకు మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లాలోని వేముల మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశా లలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సీనియర్ వాలీబాల్ పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్‌కార్డుతో ఈ నెల 7న మధ్యాహ్నం 2 గంటలకు హాజరుకావాలని, వివరాలకు 8099546565, 7901000546 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ వద్ద బస్సు, ట్రాక్టర్ ప్రమాద ఘటనపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆరా తీశారు. మణిపూర్ పర్యటనలో ఉన్న ఆయన విషయం తెలిసిన వెంటనే కలెక్టర్, ప్రభుత్వాస్పత్రి వైద్యులు, తిమ్మాపూర్ పోలీసులతో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ప్రయాణికుల భద్రతపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.



సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన వ్యాపారులు

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

ముత్తారం, నవంబరు4(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడుతాయని ఎస్‌ఐ రవి కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని అడవిశ్రీరాంపూర్ చౌరస్తాలో ఆర్ఎంపీలు, వ్యాపారుల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం ప్రారంభించారు. ఒక సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమన్నారు. ఏదైనా నేరం జరిగితే నిందితులను త్వరగా గుర్తించి, శిక్షించవచ్చని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. వ్యాపారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. హెడ్‌కానిస్టేబుల్ దేవేందర్, కానిస్టేబుళ్లు రాజ్ కుమార్, వెంకటరెడ్డి, హోంగార్డు రాజు, సీసీ కెమెరాల దాతలు తాటిపాముల శంకర్, హుస్సేన్, రాజేందర్, కుమార్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు

వీణవంక, నవంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘన్ముక్ల తెలంగాణ ఆదర్శ విద్యార్థులు హుజూరాబాద్ బాయ్స్ హైస్కూల్‌లో నిర్వహించిన ఎస్జీఎఫ్ ఉమ్మడి జిల్లా స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మోయిజ్‌బాగ్ తెలిపారు. అండర్ 14 విభాగంలో శ్రీచందన, అండర్17 విభాగంలో హర్షిక ఎంపికైనట్లు ఎస్జీఎఫ్ సెక్రెటరీ వేణుగోపాల్ తెలిపారు. వీరు మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

కొండగట్టులో భక్తుల పూజలు



కొండగట్టులో భక్తులు

మల్యాల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. వేలాదిగా ముఖ్యంగా ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లా నుంచి వచ్చిన భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనం చేసుకున్నారు. సమ్మక్క సారలమ్మ జాతరకు రెండు నెలల ముందే వివిధ ఆలయాలను సందర్శించి, జాతర సమయంలో సమ్మక్క, సారక్కను దర్శించుకుంటారు. ఇందులో బాగంగానే కొండగట్టులో మంగళవారం రోజంతా భక్తులతో రద్దీ నెలకొంది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. ఘాట్ రోడ్డుకిరువైపులా వాహనాలు నిలిపి ఉంచడంతో రాకపోకలకు తీవ్ర అసౌకర్యం ఏర్పడింది.

ధర్మపురిలో వైభవంగా తులసీ కల్యాణం



ధర్మపురిలో తులసీ కల్యాణం జరుపుతున్న అర్చకులు

ధర్మపురి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో తులసీ కల్యాణం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం నుంచి అర్చకులు ఉత్సవ మూర్తులను శేషప్ప కళావేదికపై తీసుకవచ్చారు. అనంతరం అందంగా పూలతో అలంకరించిన రుక్మిణి, సత్యభామ సహిత వేణుగోపాల స్వామివారలకు శాస్త్రోక్తంగా కళ్యాణం చేయించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

7న 'శాతవాహన' స్నాతకోత్సవం

- ముఖ్య అతిథులుగా ఛాన్సలర్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, హెచ్‌సీయూ వీసీ బీజే రావు

- విద్యార్థులకు 161 బంగారు పతకాలు, 25 పీహెచ్‌డీ పట్టాల పంపిణీ



మాట్లాడుతున్న శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేశ్‌కుమార్



స్నాతకోత్సవానికి జరుగుతున్న ఏర్పాట్లు

గణేశ్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం రెండో స్నాతకోత్సవాన్ని ఈ నేల 7న నిర్వహించనున్నామని ఉప కులపతి యు ఉమేష్‌కుమార్ తెలిపారు. విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కులపతి, గవర్నర్‌జిష్ణుదేవ్‌వర్మ, హైదరాబాద్ కేంద్రియ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య బీజే రావు హాజరు కానున్నారని తెలిపారు. ఈ సందర్భంగాద వర్సిటీ ఆవరణలోని క్రీడా మైదానంలో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. విశ్వవిద్యాలయం పరిధిలో ప్రతిభ కనబర్చిన 161 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 25 మంది విద్యార్థులకు పీహెచ్‌డీ పట్టాలు అందజేయనున్నాట్లు తెలిపారు. బంగారు పతకాలు, పీహెచ్‌డీ పట్టాలు అందుకునే విద్యార్థులు తమ పేర్లు, మొబైల్ నంబరు, ఫొటో, ఈమెయిల్ ఐడీలను విశ్వవిద్యాలయ వెబ్సైట్లో నమోదు చేసుకోవాలన్నారు. దాని ఆధారంగా వేదిక వద్ద వారికి సీట్లు కేటాయిస్తామని తెలిపారు. విద్యార్థులతోపాటు ఒకరి మాత్రమే వర్సిటీలోకి అనుమతి ఉంటుందన్నారు. నవంబరు 7న ఉదయం 10 గంటలకు స్నాతకోత్సవం ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమానికి గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి జిష్ణుదేవ్ వర్మ అధ్యక్షత వహించిన స్నాతకోత్సవ ప్రసంగం చేస్తారన్నారు.

గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్ : శాతవాహన యూనివర్శిటీ స్నాతకోత్సవానికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ముఖ్య అతిథిగా హాజరవుతున్నందున పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పమేలాసత్పతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో అధికారులతో గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గవర్నర్ పర్యటనలో ప్రొటోకాల్ పాటిస్తూ ఎలాంటి ఇబ్బందులు రాకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని, సమయ పాలన పాటించాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. మెడికల్ టీం, 108, 101, ప్రత్యేక డాక్టర్ల బృందం ఏర్పాటు చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి సూచించారు. సభావేదిక ఏర్పాట్లను ఆర్అండ్‌బీ అధికారులు, తాగునీరు, శానిటేషన్, ఫాగింగ్ వంటి ఏర్పాట్లను మున్సిపల్ అధికారులు చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసే స్టాళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలపై పలు సూచనలు చేశారు. యూనివర్సిటీలో పూర్తిస్థాయిలో భద్రత ఉంటుందని, ఐడెంటిటీ కార్డులు ఉన్నవారిని మాత్రమే లోనికి అనుమతించాలన్నారు. గేటు వద్ద తనిఖీ కోసం యూనివర్సిటీ తరఫున సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు. గవర్నర్ కార్యక్రమానికి హాజరయ్యే వారి పేర్ల జాబితాను ముందే సమర్పించాలన్నారు. శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేశ్‌కుమార్, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాఖడే, లక్ష్మీకిరణ్, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, డీసీపీ వెంకటరామిరెడ్డి ఉన్నారు.

మళ్లీ తెరుచుకున్న ఎల్ఎండీ గేట్లు

- 2గేట్ల ద్వారా 4వేల క్యూసెక్కుల నీటి విడుదల



ఎల్ఎండీ నుంచి విడుదలవుతున్న నీరు

తిమ్మాపూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో ఈ సీజన్‌లో ఎల్ఎండీ గేట్లు తరచుగా ఎత్తుతున్నారు. తుఫాను ప్రభావంతో రెండు రోజుల క్రితం తెరచి ఉన్న ఎల్ఎండీ స్పిల్‌వే గేట్లు అధికారులు మూసివేశారు. సోమవారం అర్ధరాత్రి నుంచి ఎగువన కురుస్తున్న వర్షాలతో మోయతుమ్మెద వాగు నుంచి ఎల్ఎండిలోకి ఇన్‌ఫ్లోలు పెరుగడంతో మంగళవారం మధ్యాహ్నం రెండు గేట్లు ఎత్తి 4వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. ఎల్ఎండీలోకి మోయతుమ్మెద వాగు నుంచి 4,254క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. రెండు స్పిల్‌వే గేట్ల నుంచి 4వేల క్యూసెక్కులు, మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో కలిసి 254క్యూసెక్కులు మొత్తం 4,254 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉన్నది.

శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద



జగిత్యాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు రావడం మంగళవారం తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతం నుంచి 28,204 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 6 వరద గేట్లు ఎత్తి దిగువ గోదావరిలోకి 18,750 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతర ములకు కలిపి ప్రాజెక్టు నుంచి 28,204 క్యూసెక్కుల నీటిని వదులుతు న్నారు. ఇందులో ఎస్కేప్ గేట్ల ద్వారా 8 వేల క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 573 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది.

రాజన్న సన్నిధిలో భక్తుల రద్దీ



వేములవాడలో భక్తులు



బద్దిపోచమ్మ ఆలయంలో బారులు తీరిన భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం కార్తీక సందడి నెలకొంది. మంగళవారం ఉదయం వర్షంలోనూ స్వామివారి లఘు దర్శనానికి బారులు తీరారు. వర్షంలోనూ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వరాలయంలో భక్తులు కోడె మొక్కులు చెల్లించి ఆర్జిత సేవలైన కల్యాణం, సత్యనారాయణ వ్రతం, కుంకుమ పూజలు, ఇతర పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు.

బద్దిపోచమ్మ ఆలయంలో ..

బద్దిపోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. మంగళవారం వేములవాడ పట్టణంలోని బద్దిపోచమ్మ ఆలయంలో వేలాదిమంది భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు భక్తులకు రెండుగంటల సమయం పట్టింది. క్యూలైన్‌లో భక్తులు కిక్కిరిసిపోయారు. ఒక్కసారిగా బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయానికి వేలాదిమంది భక్తులు చేరుకోవడంతో ఇబ్బందులకు గురయ్యారు. అయితే ఎప్పటికప్పుడు ఆలయ సూపరింటెండెంట్ రాజు, ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌రావు పర్యవేక్షించారు.

నేడు భీమేశ్వరాలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు

రాజరాజేశ్వరస్వామి అనుబంధ దేవాలయమైన భీమేశ్వరాలయంలో బుధవారం కార్తీకపౌర్ణమి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బుధవారం సాయంత్రం ఆరు గంటలకు భీమేశ్వరస్వామివారికి, భీమేశ్వర సదన్ పరిసర ప్రాంతంలో సామూహిక దీపారాధన నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని ఇన్‌చార్జి ఈవో రాజేశ్ తెలిపారు.

బాక్సింగ్, కబడ్డీలో విద్యార్థుల ప్రతిభ

- రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణిస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు
- జాతీయ స్థాయిలో పాల్గొనాలనే లక్ష్యంతో సాధన





నార్మల రజిత



పుల్లె సాగరిక



మొగిలి సింధూజ

మంథనిరూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలలో ప్రతిభ చాటుతూ జాతీయ స్థాయిలో రాణించాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నారు. మండలంలోని ఎక్లాసుపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు బాక్సింగ్, కబడ్డీలో మహిళల విభాగంలో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటుతున్నారు. వారిలో ఉన్న ప్రతిభను గుర్తించిన పాఠశాల పీడీ డాక్టర్ దోమటి రవి ప్రోత్సాహంతో జాతీయ స్థాయిలలో పాల్గొనాలనే లక్ష్యంతో సాధన చేస్తున్నారు. పాఠశాలలో 9వ తరగతి ఇంగ్లీష్ మీడియం చదువుతున్న నార్మల రజితకు బాక్సింగ్‌పై ఆసక్తి ఉండటంతో ఆమెకు శిక్షణ ఇవ్వడంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో జరిగిన అండర్-17 మహిళల 48 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. సెప్టెంబరులో హన్మకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని ప్రతిభ చాటింది. బాక్సింగ్‌లో మెలకువలు నేర్చుకొని జాతీయ స్థాయిలో పాల్గొనాలనే లక్ష్యంతో కష్టపడి సాధన చేస్తున్నట్లు రజిత తెలిపింది. ఇదే పాఠశాలకు చెందిన పుల్లె సాగరిక పదో తరగతి ఇంగ్లీష్ మీడియం చదువుతోంది. కబడ్డీలో ప్రతిభ చాటుతూ జిల్లాస్థాయిలో రాణించి ఈనెల 8, 9, 10 తేదీలలో భద్రాది కొత్తగూడెంలో జరగనున్న అండర్-17 రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. సాగరిక గత సంవత్సరం జరిగిన రాష్ట్ర స్థాయి సీఎం కప్ కబడ్డీ పోటీలలో పాల్గొంది. జాతీయ స్థాయిలో రాణించాలనే లక్ష్యంతో ప్రాక్టీస్ చేస్తున్నట్లు తెలిపింది. పాఠశాలలో 9వ తరగతి ఇంగ్లీష్ మీడియం చదువుతున్న మొగిళి సింధూజ కబడ్డీలో రాణించి జిల్లా స్థాయిలో ప్రతిభ చాటడంతో గత నెలలో సంగారెడ్డి జిల్లాలో జరిగిన అండర్-14 మహిళల విభాగంలో కబడ్డీ పోటీలో పాల్గొంది. జాతీయ స్థాయిలో పోటీలలో పాల్గొనడానికి కృషి చేస్తానని సింధూజ తెలిపారు.

విద్యార్థుల ఇష్టంతోనే శిక్షణ

-పీడీ డాక్టర్ దొమ్మటి రవి



గత సంవత్సరం పాఠశాలకు బదిలీపై వచ్చాను. విద్యార్థులకు కబడ్డీ, బాక్సింగ్‌పై ఆసక్తి ఉండటంతో వారికి ప్రత్యేకంగా రోజు శిక్షణ ఇస్తున్నా. శిక్షణను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు క్రీడల్లో తమ ప్రతిభను చాటుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారు. కష్టపడి సాధన చేస్తే జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొంటారు.

'తెల్ల'బోతున్నారు..

(3వ పేజీ తరువాయి)

వేములవాడ రూరల్ లో 3800 ఎకరాలు సాగు చేశారు. జిల్లాలో కొన్నిచోట్ల భారీ వర్షాలకు పత్తి నష్టపోయినా ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. పంట దెబ్బ తిన్న చేన్లలో కూడా ఎకరానికి 8 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. దీని ప్రకారం జిల్లాలో ఐదు లక్షలపైగానే పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉంది. సీసీఐ ఎకరానికి 7క్వింటాళ్ల కొనుగోలు పరిమితి విధించడంతో మిగతా నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల పత్తి దళారులకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్థానిక 'నారాయణపూర్ సేవా సంస్థ' ఆధ్వర్యంలో మంగళవారం నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దేవరాజు, సంస్థ సభ్యులు దేవిరెడ్డి, మనోహరిచారి, తిరుపతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు ఉపకరణాలు

- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్



కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్

ఇల్లంతకుంట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) అర్హులైన దివ్యాంగులు, వయోవృద్ధులకు ఉపకరణాలు అందించాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం అలింకో, ఏడీఐపీ, ఆర్వీవై ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు దివ్యాంగులని వివక్షత చూపవద్దని, అందరితో సమానంగా గౌరవించాలని పేర్కొన్నారు. దివ్యాంగులు యూడీఐడీ కార్డు కోసం మొబైల్ లేదా మీసేవా ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులకు కేటాయించిన రోజులలో దవాఖానకు వెళ్లాలని, అక్కడ అన్ని వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. శిబిరాలను ఏర్పాటు చేసి అర్హులకు పరికరాలను అందిస్తున్న అలింకో బాధ్యులను అభినందించారు. అర్హత సాధించిన వారికి చేతి, చంక కర్రలు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, ట్రైసైకిల్‌, మోకాళ్ల పట్టీలు మొదలైన సహాయక పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులు, వృద్ధులు కావలసిన పత్రాలు వెంట తీసుకొని రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, సీడీపీవో ఉమారాణి, ఎంపీడీవో శశికళలతో పాటు వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగేలా చూడాలి..

వరిధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగేలా చూడాలని నిర్వాహకులకు ఇన్‌చార్జి కలెక్టర్ సూచించారు. మండలకేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చి మద్దతు ధరను పొందాలన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించారు. ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికి ఇంటి పనులను ప్రారంభించని వారు వారంరోజుల్లో ప్రారంభించాలని లేనట్లయితే రద్దుచేయడం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శంకర్, ఎంపీడీవో శశికళ, ఏఎమ్‌సీ ఉపాధ్యక్షుడు ప్రసాద్, ఏపీఎం లతామంగేశ్వరిలతో పాటు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ విజయవంతం చేయాలి

- ఎన్‌ఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్



మాట్లాడుతున్న ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్

సిరిసిల్ల టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై జరిగిన దాడిని ఖండిస్తూ ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో ఈనెల 17న నిర్వహించనున్న చలో ఢిల్లీని విజయవంతం చేయాలని ఎన్ఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఎంఆర్పీఎస్, ఎంఎస్‌పీ, అనుబంధ సంఘాల జిల్లా ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మన్, ఎంఆర్పీఎస్ నాయకుడు ఆవునూరి ప్రభాకర్ మాట్లాడారు. ఈనెల 17న చలో ఢిల్లీ కార్యక్రమానికి నాయకులను, కార్యకర్తలను సన్నద్ధం చేయడం కోసం ఈనెల 6న కరీంనగర్ జిల్లా కేంద్రంలో ముఖ్య నాయకుల సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఎంఆర్పీఎస్ జిల్లా కన్వీనర్ యెల గందుల బిక్షపతి, వీహెచ్‌పీఎస్ జిల్లా కన్వీనర్ చెన్నమనేనిని పురుషోత్తంరావు, ఎంఆర్పీఎస్ జిల్లా కన్వీనర్‌లు సావనపెల్లి రాకేష్, దొబ్బల ఆనంద్, తంగళ్ళపల్లి మండల అధ్యక్షుడు సావనపెల్లి బాలయ్య చందుర్తి మండల అధ్యక్షుడు తర్రె శంకర్, రుద్రంగి మండల అధ్యక్షుడు దయ్యాల నారాయణ, ముస్తాబాద్ మండల అధ్యక్షుడు కొమ్మెట రాజు, నాయకులు గసికంటి కళ్యాణ్, బడుగు సంజీవ్, కట్కూరి ప్రశాంత్ పాల్గొన్నారు.

శివాలయానికి తాళం.. భక్తుల నిరసన



నిరసన తెలుపుతున్న స్థానికులు, బీజేపీ నాయకులు

తంగళ్లపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలో అతి పురాతన త్రికూట శివాలయానికి పక్కనే ఉన్న స్థల యజమాని తాళం వేయడంతో భక్తులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల క్రితం నాటి ఆలయంలో పూజలు నిర్వహించకుండా ఆలయం పక్కన ఉన్న స్థలం యజమాని ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. పూజలు నిర్వహించడానికి వెళ్లిన పూజారి తను వేసిన తాళం పగలగొట్టి స్థల యజమని మరో తాళం వేయడంతో పూజలు నిర్వహించకుండానే పూజారి వెనుతిరిగాడని అన్నారు. పూజలు నిర్వహించకుండా అడ్డుకుంటున్న స్థలం యజమాని చర్యలు నిరసిస్తూ స్థానికులు, భక్తులు దేవాలయం వద్ద ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు వెన్నమనేని శ్రీధర్‌రావు, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, నాయకులు గజభీంకర్ సంతోష్ తదితరులు మద్దతుగా ఆందోళనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు కొడం రమేష్, హన్మంత్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, అనిల్‌గౌడ్, కందుకూరి రామగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గంభీరావుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం లింగన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1974-75లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సర్ణోత్సవ ఆత్మీయ సమ్మేళనాన్ని మంగళవారం ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. పదో తరగతి చదువుకుని 50 ఏళ్లు గడిచిన సందర్భంగా సర్ణోత్సవ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులను అందించారు. విద్యార్థులు రాసిన పద్యాలు, కవితలు, పుస్తక ముద్రణకు ఆర్థిక సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఉపాధ్యాయులను, బాల కవులను ఘనంగా సన్మానించారు.

పత్తి రైతులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు..

- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పత్తి రైతులకు తమ పంటను విక్రయించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. ఈనెల 6 నుంచి రాష్ట్రవ్యాప్తంగా జిన్నింగ్ మిల్లులు సమ్మె ప్రారంభిస్తున్నారనే తెలియజేసిన నేపథ్యంలో సిరిసిల్ల కలెక్టరేట్‌లో మంగళవారం మార్కెటింగ్, సీసీఐ, పోలీస్ ఇతర శాఖల అధికారులతో పత్తి విక్రయాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ జిన్నింగ్ మిల్లులు సమ్మెతో రైతులందరూ ఇబ్బందిపడే అవకాశం ఉందని మిల్లుల యాజమానులు సమ్మెను విరమించుకోవాలని సూచించారు. సమ్మె కారణంగా రైతులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాన్ని మార్కెటింగ్, సీసీఐ అధికారులకు ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోళ్లు పక్కగా చేయాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, మార్కెటింగ్ అధికారి ప్రకాష్, జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం, సీసీఐ సీపీవో రఘురామ్, అగ్నిమాపక శాఖ, రవాణా శాఖల అధికారులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం



పెద్దూర్‌లో తడిసిన ధాన్యం



సుద్దాలలో తడిసిన ధాన్యాన్ని తీస్తున్న రైతు

సిరిసిల్ల రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు, చంద్రంపేట, ముష్టిపల్లి, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూర్, సర్ధాపూర్ గ్రామాల్లో మంగళవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షంతో ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళనలు చెందుతున్నారు. ఈ గ్రామాల్లో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలల్లో పోసి ధాన్యంను అధికారులు సక్రమంగా కొనుగోలు చేయకపోవడంతో రైతులు ధాన్యం కుప్పలను కాపాడుకుంటూ అకాల వర్షాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని రైతులు కోరుతున్నారు.

● వేములవాడ : వేములవాడ పట్టణంలో మంగళవారం ఉదయం వర్షం కురిసింది. అనుకోకుండా వచ్చిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిముద్దాయింది. సోమవారం రాత్రి వర్షం కురువకపోవడంతో వాతవరణం అనుకూలించిందని అనుకున్న రైతులు మంగళవారం తెల్లవారు జామున కొనుగోలు కేంద్రాలకు వెళ్లి ధాన్యాన్ని ఆరబెట్టారు. దీంతో ఒక్కసారిగా వర్షం కురువడంతో కొంత మంది రైతుల ధాన్యం తడిసి ముద్దాయింది. కొనుగోళ్లను వేగవంతం చేయాలని, తడిసిన ధాన్యం వెంటన్నే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

● కోనరావుపేట : కోనరావుపేటలో మంగళవారం ఉదయం వర్షం పడడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడ్డారు. ధాన్యం తడిసి ముద్దయింది. ఒక్కసారిగా వర్షం పడడంతో ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు ఇబ్బందులు పడ్డారు. అయినప్పటికీ ధాన్యం తడిసి ముద్దయింది. అధికారులు స్పందించి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



సుదర్శన హోమంలో పాల్గొన్న దంపతులు

వైభవంగా సుదర్శన హోమం

ఎల్లారెడ్డిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం సుదర్శన హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నవీన్‌చారి ఆధ్వర్యంలోని పురోహితులు సుదర్శన హోమం జరిపించారు. దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 5న ఉదయం స్వామి వారు గరుడ వాహనంపై ఊరేగింపు, రాత్రి రథోత్సవం నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలంటూ రాస్తారోకో



సిరిసిల్ల పెద్దూర్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

సిరిసిల్ల రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించకుండా కాంగ్రెస్ పార్టీ వారు అడ్డుకుంటున్నారంటూ రైతులు రోడ్కెకి రాస్తారోకో చేపట్టారు. ఈ సంఘటన సిరిసిల్ల అర్బన్ పరిధిలో పెద్దూర్ మంగళవారం చోటుచేసుకుంది. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్‌లో సింగిల్ విండో ఆధ్వర్యంలో గత సంవత్సరాలు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేసుకుని రైతులనుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుంటారు. అయితే గత సంవత్సరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్‌విండోకు ఇవ్వకుండా అప్పటి కలెక్టర్ మెప్మా ఆధ్వర్యం లో మహిళ సంఘాలకు ఇచ్చారు. దీంతో సింగిల్ విండో పాల కవర్గం హైకోర్టును ఆశ్రయించగా తిరిగి సింగిల్ విండోకు కొను గోలు కేంద్రాన్ని ఇవ్వాలని హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో ఇటీవల పౌరసరఫరాల శాఖ అధికారులు సింగిల్ విండోకు కొనుగోలు కేంద్రాన్ని తిరిగి ఇవ్వడంతో పాటు గన్నీ సంచులను అందించి రైస్ మిల్లులను కేటాయించి రవాణా కోసం లారీలను సైతం కేటాయించారు. అయితే ఇటీవల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేందుకు పాలకవర్గం నిర్ణయించగా అధికార పార్టీకి చెందిన వారు పెదూర్ సింగిల్ విండో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించవద్దంటూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించకుండా 20 రోజులు నుంచి అధికారులు అడ్డుకుంటున్నారని రైతులు వాపోయారు. ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షాల వల్ల తడిసిపోయి ఇబ్బందులు పడుతున్నామంటూ మంగళవారం సింగిల్ విండో పాలకవర్గంతోపాటు రైతులు రాస్తారోకో చేపట్టారు. టౌన్ సీఐ కృష్ణ, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్‌తోపాటు సిరిసిల్ల తహసీల్దార్ మహేష్‌కుమార్‌లు కలెక్టర్‌తో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకోను విరమించారు. సింగిల్‌విండో చైర్మన్ జీల కిషన్‌యాదవ్, ఏఎంసీ మాజీవైస్ చైర్మన్ ఎరవెళ్లి వెంకటరమణారావు, మాజీ సర్పంచ్ అదిపెల్లి దేవయ్యగౌడ్, గంద్ర రమేష్‌రావు, సల్లూరి మురళీ, సింగిల్ విండో డైరెక్టర్‌లు సలేంద్రి బాలరాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక సూచికలను ఏర్పాటు చేయాలి

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు4(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల కేంద్రం నుంచి ఎల్లారెడ్డిపేట వరకు గల ప్రధాన రహదారిపై ఉన్న మూలమలుపు వద్ద హెచ్చరిక సూచికలను ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల నాయకుడు మల్లారపు అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. అధికారులు హెచ్చరిక సూచికలను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని అరుణ్‌కుమార్ కోరారు.

పాడి రైతులకు పాల క్యాన్ల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, నవంబరు4(ఆంధ్రజ్యోతి): బాకురుపల్లిలోని మహిళా పాడి రైతులకు కరీంనగర్ పాల ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో పాల క్యాన్లను సంస్థ మేనేజర్ రవి పంపిణీ చేశారు. అసిస్టెంట్ మేనేజర్ రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టుకు మరమ్మతులు

- ఎమ్మెల్యే ఆదేశాలతో కదలిన అధికారులు

కోనరావుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు ప్రధాన రహదారి పెంటి వాగుపై ప్రవాహానికి కల్వర్టు కొట్టుకపోయింది. సిరిసిల్ల కోనరావుపేట మీదుగా నిమ్మ పెల్లి, సిరికొండకు వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న పెంటివాగు కల్వర్టు అధిక వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో రెండు జిల్లాల ప్రజలు వాహనదారులు ఆర్టీసీ అధికారులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఎవరు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి ప్రజలు తీసుకెళ్లడంతో వెంటనే బాగు చేయాలని అధికారులకు ఆదేశా లిచ్చారు. దీంతో మంగళవారం అధికారులు పెంటి వాగుపై పైపులు వేసి మొరంపోసి వాహనదారుల కష్టాలను తొలగించారు.

కమనీయం.. శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం..



కల్యాణానికి హాజరైన భక్తులు



పట్టు వస్త్రాలు, తలంబ్రాలు తీసుకువస్తున్న చైర్మన్ శంకర్, భక్తులు

రుద్రంగి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : రుద్రంగి ప్రహ్లాద పర్వతంపై వెలిసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం మంగళవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. స్వామివారి కల్యాణానికి ఆలయ కమిటీ చైర్మన్ కోమిరె శంకర్‌లు పట్టువస్త్రాలు, తలంబాలు సమర్పించారు. అర్చకులు శ్రీనివాస్‌శర్మ, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. వేలాది మందికి భక్తులు కల్యాణంలో పాల్గొని తిలకించి అనంతరం కట్నకానుకలు సమర్పించారు. కల్యాణానికి చందుర్తి సీఐ వేంకటేశ్వర్లు హాజరయ్యారు. ఎస్ఐ శ్రీనివాస్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, ఆలయ వైస్ చైర్మన్ దాసరి గంగారాజం, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, సామ మోహన్‌రెడ్డి, కెసిరెడ్డి నర్సారెడ్డి, గండి నారాయణ, పల్లి గంగాధర్, మాడిశెట్టి ఆనందం, మాడిశెట్టి అభిలాష్, ఇప్ప మహేష్, బండారి నర్సయ్య, కర్నవత్తుల దేవేందర్, తర్రె లింగం, దుబ్బ రవి, అల్లూరి గంగారెడ్డి, సిరికొండ రవి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం అందేలా చూడాలి : ఎస్పీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్ బి. గితే

ఎల్లారెడ్డిపేట, నవంబరు4(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో శాంతిభద్రతల పరిరక్షణలో సిబ్బంది అంకితభావంతో పని చేస్తూ బాధితులకు సత్వర న్యాయం చేసేలా చూడాలని ఎస్పీ మహేశ్ బి. గితే అన్నారు. ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఠాణాలోని రికార్డులు, కేసులు, పరిసరాలను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలు, గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లోని గ్రామ పోలీసు అధికారులు సమాచార వ్యవస్థను మెరుగు పర్చుకోవాలన్నారు. తనిఖీల్లో భాగంగా రౌడీ షీటర్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిత్యం స్టేషన్ పరిధిలోని డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను ముమ్మరం చేయాలని సూచించారు. వెంట ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఉన్నారు.

అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి

ఇల్లంతకుంట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : రైతులు వరిపంటలో వస్తున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని అధిక దిగుబడులు సాధించాలని కరీంనగర్ రైతు విజ్ఞానకేంద్రం కోఆర్డినేటర్ హరికృష్ణ పేర్కొన్నారు. మండలంలోని పొత్తూరు గ్రామంలోని ఆదర్శరైతు కరుణాకర్‌రెడ్డి వరిపంటలో క్షేత్రదినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో భాస్వరాన్ని కరిగించే బ్యాక్టీరియా వాడటం వల్ల రసాయన ఎరువుల ఖర్చును తగ్గించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు రాజేంద్రప్రసాద్, మదన్‌మోహన్‌రెడ్డి, ఏతఊట అర్చన, చెరుకు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

చందుర్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) :మండలంలోని రామన్నపేట-చందుర్తి శివారులోని గుట్టపై వెలసిన వేంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవానికి ఆలయం ముస్తాబైంది. బుధవారం స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

బంగారు పట్టినామాలు, కోర మీసాలు అందజేత

రుద్రంగి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : శ్రీలక్ష్మీనర్సింహస్వామికి మండల కేంద్రానికి చెందిన ఎన్ఆర్ఐ పిట్టల నరేష్ సుమారు రూ.5లక్షల విలువగల బంగారు పట్టి నామాలు, కోరమీసాలను ఆలయ కమిటీ చైర్మన్ కోమిరె శంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో మాడిశెట్టి ఆనందం, ఆకుల గంగాధర్, గండి నారాయణ, పల్లి గంగాధర్, కర్రవత్తుల దేవేందర్, ఆకుల పెద్దన్న పాల్గొన్నారు.

రైస్ మిల్లర్లు సహకరించాలి

ఎల్లారెడ్డిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధాన్యం దిగుమతిలో ఎలాంటి ఇబ్బందులకు గురిచేయకుండా రైస్ మిల్లర్లు అన్నదాతలకు సహకరించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి మంగళవారం ఆయన సందర్శించారు. ఇటీవల కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ కేంద్రాలకు తరలించిన ధాన్యం తేమ శాతం వచ్చిన వెంటనే తూకం వేసి రైస్‌మిల్లుకు తరలించాలని, కొనుగోలులో జాప్యం చేయకూడదన్నారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తరుగు పేరిట రైస్‌మిల్లర్లు రైతులను ఇబ్బందులపాలు చేయవద్దన్నారు. అధికారులు సమన్వయంతో పని చేసి ధాన్యం కొనుగోలు, తరలింపు, డబ్బుల చెల్లింపుల ప్రక్రియను చేపట్టాలని కోరారు. నాయకులు లక్ష్మారెడ్డి, బాబు, రాంరెడ్డి, బుచ్చాగౌడ్ తదితరులు ఉన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

వేములవాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం వ్యక్తిత్వ వికాసంపై అవగహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అడ్వాన్స్‌డ్ సైకలాజికల్ సర్వీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రిటైర్డ్ మండల విద్యాధికారి సురేష్‌కుమార్ అవగహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజారత్నం ఉపాధ్యాయులు మల్లేశం, రవీందర్, కోటేశ్వర్, రాజు, హమీద్, బాలకృష్ణ, జ్యోతి, శిరోమణి తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన

చందుర్తి నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూడపల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మంగళవారం ఎంపీడీవో రాధ పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, పనులను వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన

కోనరావుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు తండాల్లో మండల వైద్యాధికారి వేణుమాధవ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహించి క్యాన్సర్‌వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై తండావాసులకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా వైద్య బృందం సువర్ణ అరుణ్ చందు జ్యోతి సరోజ తదితరులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్‌ను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు



మాట్లాడుతున్న డీఆర్‌డీవో శేషాద్రి

ఎల్లారెడ్డిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలు తలెత్తకుండా.. బిల్లుల భారం నుంచి విముక్తి కలిగించేలా సౌర విద్యుత్తును వినియోగంలోకి తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పీఎం సూర్యఘర్ ముఫ్తీ బిజిలీ యోజన'ను అమలు చేసేందుకు అన్ని చర్యలు చేపట్టేలా చూడాలని డీఆర్‌డీవో శేషాద్రి అన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేట సోలార్ మోడల్ గ్రామంగా ఎంపికయిందని పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల పరిషత్తు కార్యాలయంలో పథకం జిల్లా స్థాయి కమిటీ అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో శేషాద్రి మాట్లాడుతూ 5 వేల జనాభా కంటే ఎక్కువ ఉన్న గ్రామాల్లో అధిక విద్యుచ్ఛక్తి గ్రామాన్ని కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందని అన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి సౌర విద్యుత్తును వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో వినియోగిస్తున్న కరెంటుకు అనుగుణంగా సోలార్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నామన్నారు. సౌర విద్యుత్తు వినియోగంపై దృష్టి సారించి ప్రభుత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సమావేశంలో రెడ్కో డీఎం లక్ష్మీకాంతరాజు, మేనేజర్ మునీందర్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి అఫ్జల్‌బేగం, ఇన్‌చార్జి తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీవో సత్తయ్య, అధికారులు పాల్గొన్నారు.

నేడు ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలు

తంగళ్లపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాళ్లపేట, అంకిరెడ్డిపల్లె, అంకుసాపూర్, కస్బె కట్కూర్, మండేపల్లి గ్రామాల్లో నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇళ్లను బుధవారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో లక్ష్మీనారయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జల్గం ప్రవీణ్ కుమార్‌లు వేరు వేరు ప్రకటనల్లో తెలిపారు. మంగళవారం తంగళ్లపల్లి మండల పరిషత్ కార్యలయం అవరణలో నిర్మించిన నమూన ఇందిరమ్మ గృహన్ని ఎంపీడీవో, కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. నేడు నమూనా గృహంతో పాటు ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం చేస్తున్నట్లు ప్రకటించారు. కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతరాని పేర్కొన్నారు.